క్లుప్తంగా

అండర్ రైల్వే జోన్‌లో 2రోజులు నీటి సరఫరా బంద్

వరంగల్ అర్బన్: మిషన్ భగీరథ ఆధ్వర్యంలో ధర్మసాగర్ 60 ఎంఎల్‌డీ ఫిల్టర్ల వద్ద నిర్వహణ పనులు కొనసాగుతున్నందున సోమ, మంగళ వారాల్లో అండర్ రైల్వే జోన్ పరిధిలో నీటి సరఫరా ఉండదని బల్దియా ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. బల్దియా అండర్ రైల్వే జోన్ పరిధిలోని కరీమాబాద్, పెరుకవాడ, శివనగర్, రంగశాయిపేట, శంభునిపేట, తిమ్మాపూర్, సింగారం, మామునూరు, బొల్లికుంట, శాకరాశికుంట, ఎస్ఆర్ఆర్ తోట, ఏకశిలానగర్, కాశికుంట, ఖిలా వరంగల్, దూపకుంట, వసంతపురం, స్తంభంపల్లి, నక్కలపెల్లి, లక్ష్మిపురం, భట్టుపల్లి, కడిపికొండ, రాంపూర్, మడికొండ, దేవన్నపేట ప్రాంతాల్లో రెండు రోజులు నీటి సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు.

కేయూలో ఇద్దరికి డాక్టరేట్



జ్యోత్స్నాదేవి హారికాదేవి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో ఇద్దరు పరిశోధకులకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఇంగ్లిష్ విభాగం పరిశోధకురాలు వద్నాల జ్యోత్స్నాదేవికి డాక్టరేట్ ప్రకటించారు. ది స్టడీ ఆఫ్ గీతహరిహరన్స్ సెలక్ట్ నావెల్స్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి జ్యోత్స్నాదేవికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి తెలిపారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మేఘనరావు పర్యవేక్షణలో జ్యోత్స్న తన పీహెచ్‌డీ పూర్తిచేశారు. అలాగే, మైక్రో బయాలజీ విభాగం పరిశోధకురాలు మనుబోలు హారికాదేవికి డాక్టరేట్ ప్రకటించారు. బయో ఇథనాల్ ప్రొడక్షన్ ఫ్రమ్ అగ్రికల్చరల్ వేస్ట్ యూజింగ్ ఐసోలేటెడ్ ఫంగల్ స్పిసియస్ అనే అంశంపై ఆ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ముంజం శ్రీనివాస్ పర్యవేక్షణలో సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి హారికాదేవికి డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి తెలిపారు.

దారితప్పిన బాలుడి అప్పగింత

ఖిలా వరంగల్: వరంగల్ పడమరకోటలో దారితప్పిన ఓ బాలుడిని ఆదివారం సాయంత్రం మిల్స్‌కాలనీ పోలీసులు అతని తండ్రి చెంతకు చేర్చారు. ఆడుకుంటూ వెళ్లి ఇంటి దారి తెలియక ఏడుస్తుండగా స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు బాలుడి సమాచారాన్ని తెలుసుకుని అప్పగించారు.

రోటరీ క్లబ్ సామాజిక సేవలు ఆదర్శం



ఖిలా వరంగల్: రోటరీ క్లబ్ సామాజిక సేవలు ఆదర్శనీయమని రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ అధ్యక్షుడు మామిడాల రమేష్ బాబు, తోట వైద్యనాథ్ అన్నారు. ఉచిత వైద్య శిబిరాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వరంగల్ ఫోర్ట్‌రోడ్డులోని రోటరీ క్లబ్ భవనంలో తోట వైద్యనాథ్ ఆధ్వర్యంలో ఆరుషి హాస్పటల్ నేతృత్వంలో గుండెకు సంబంధించిన ఈసీజీ, మధుమేహ పరీక్షలను ఆదివారం నిర్వహించారు. శిబిరంలో జనరల్ మెడిసిన్ డాక్టర్ హరిరమాదేవి, డాక్టర్ తోట శివాని, డాక్టర్ కంది సాయి, తోట మహేష్, మామిడాల సుధాకర్, ఆనంద్‌రావు, రామగిరి రవీందర్, శివ, వెంకటేశ్వర్లు, తోట మధుమతి, దేవ, సాంబమూర్తి, రామగిరి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



హసన్‌పర్తి: నగరంలోని 56వ డివిజన్ గోపాలపురంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సీనియర్స్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సిరంగి సునీల్‌కుమార్ మాట్లాడుతూ వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్స్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు నర్సయ్య, దామోదర్, తేరాల యుగంధర్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు మణీందర్‌నాథ్, మాజీ ఉప సర్పంచ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కంటికి రెప్పలా కాపాడుకుంటా

ఎల్కతుర్తి: పార్టీ కోసం పనిచేసే ప్రతీ కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటానని హుస్నాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పొన్నం ప్రభాకర్ అన్నారు. కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రకటించిన మేనిఫెస్టోను గడప గడపకు వెళ్లి ప్రచారం చేయాలని కోరారు. భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండల కేంద్రాల్లో బూత్‌లెవల్ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.

డ్రెయినేజీ అస్తవ్యస్తం



మురుగునీటి కాల్వల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, వ్యర్థాలు

● స్పందించని అధికారులు, పాలకులు

హసన్‌పర్తి: నగరంలోని రెండో డివిజన్ వంగపహాడ్‌లో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. నెల రోజులైనా మురుగునీటి కాల్వలను శుభ్రం చేయక పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దోమల బెడదతో రాత్రి వేళ కంటిమీద కునుకు లేకుండా పోతోందని స్థానికులు వాపోతున్నారు. సమస్యను పరిష్కరించాలని కోరినా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించడం లేదని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎంజీఎంకు అంబులెన్స్ బహూకరణ

● మర్కజీ పాఠశాలకు కంప్యూటర్ల అందజేత


అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న రాజేశ్‌కుమార్

ఎంజీఎం / కాశిబుగ్గ: వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి ఎస్‌బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేశ్‌కుమార్ ఆదివారం అంబులెన్స్‌ను బహూకరించారు. ఈమేరకు అంబులెన్స్‌కు సంబంధించిన పత్రాలను ఎంజీఎం ఆర్ఎంఓలు మురళి, ప్రసాద్‌కు అందించారు. అలాగే, ప్రభుత్వ మర్కజీ పాఠశాలకు రూ.5 లక్ష విలువగల కంప్యూటర్లను సైతం అందించినట్లు రాజేశ్‌కుమార్ పాటు తెలిపారు. కాజీపేటలోని సహృదయ వృద్ధాశ్రమానికి రూ.2లక్షల విరాళం అందించినట్లు తెలిపారు. ఎస్‌బీఐ ద్వారా సమాజ సేవ చేయాలనే ఉద్దేశంతో విద్య, వైద్య రంగాలతో పాటు సామాజిక సేవ దృక్పథంలో వృద్ధాశ్రమాలకు విరాళాలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ మేనేజర్ వివేక్‌చంద్ర, బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'తూర్పు' తలరాతను మార్చేస్తాం..


పార్టీలో చేరిన వారితో మురళీధర్‌రావు, శ్యామ్

ఖిలా వరంగల్: వరంగల్ తూర్పు నియోజకవర్గ తలరాతను మార్చేస్తామని మాజీ మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు అన్నారు. ఖిలా వరంగల్ పడమరకోటలో గజ్జల శ్యామ్ ఆధ్వర్యంలో పలు పార్టీలకు చెందిన కార్యకర్తలు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యాటక ప్రదేశాన్ని సుందరంగా తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మైదం రవి, వేల్పుల శివ, మైదం బాబు, తోటకూరి కార్తీక్, జూలూరి ప్రవీణ్, శాస్త్రబోయిన శివ, గాండ్ల హరీశ్, ఎనుకంటి నర్సింగం, పోశాల సారంగపాణి, బైరబోయిన రవియాదవ్, మందాటి గిరి, పిట్ట రాజు, ఆకుతోట అఖిల్, వేల్పుల ప్రదీప్, సాగర్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకుపోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న రాధాకృష్ణ

వరంగల్: దేశంలో కేంద్రం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకుపోయి బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని తమిళనాడు మాజీ ఎంపీ రాధాకృష్ణ సూచించారు. ఎన్నికల ఇన్‌చార్జ్‌గా వచ్చిన ఆయన ఎల్‌బీనగర్‌లోని పార్టీ కార్యాలయంలో తూర్పు కన్వీనర్ పొట్టి ప్రసాద్ ఆధ్వర్యంలో జోనల్, డివిజన్ ఇన్‌చార్జ్‌లు, డివిజన్ అధ్యక్షులతో ఆదివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా పలు అంశాలపై కార్యకర్తలు, నాయకులకు దిశానిర్దేశం చేశారు. పార్టీ అభ్యర్థులకు విజయానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ మేయర్ రాజేశ్వర్‌రావు, మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, తూర్పు అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్ వాసుల మద్దతు అవాస్తవం

హన్మకొండ: అపార్ట్‌మెంట్ నివాసితులు బీఆర్ఎస్ పార్టీకి సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు అపార్ట్‌మెంట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రెంటాల కేశవరెడ్డి మాట్లాడడంలో వాస్తవం లేదని ఆ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి గుండ్ల శ్రీనివాస్ స్పష్టం చేశారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని అపార్ట్‌మెంట్ నివాసితులంతా బీఆర్ఎస్‌కు మద్దతు ఇస్తున్నట్లు తీర్మానించినట్లు కేశవరెడ్డి చెప్పడాన్ని ఆయన ఒక ప్రకటనలో ఖండించారు. అపార్ట్‌మెంట్‌వాసుల ఏఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదని తెలిపారు. నీటి పన్ను, చెత్త పన్నును కమర్షియల్ టాక్స్ కింద వసూలు చేస్తున్నారని, సామాన్య ప్రజలు అపార్ట్‌మెంట్‌లో నివసిస్తే కమర్షియల్‌గా ఎలా మారుతారని ప్రశ్నించారు. డీవియేషన్ పేరిట నాలుగు రేట్లు ఫెనాల్టీ విధిస్తూ వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు ఎన్నిసార్లు వినతి పత్రాలు ఇచ్చినా ఎలాంటి స్పందన లేదని తెలిపారు. అపార్ట్‌మెంట్ దర్శన్ నిర్వహించి సమస్యలు పరిష్కరించారని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని ఆయన విమర్శించారు. అపార్ట్‌మెంట్‌వాసులను ఓటు అడిగే హక్కు వినయ్‌భాస్కర్‌కు లేదని పేర్కొన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవద్దని శ్రీనివాస్ సూచించారు.

దైవభక్తి కంటే దేశభక్తి చాలా గొప్పది


ఆటోడ్రైవర్లకు డ్రెస్సులు అందజేస్తున్న ట్రస్టీలు

వరంగల్: దైవభక్తి కంటే దేశభక్తి చాలా గొప్పదని శివానంద గురు కల్చరల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్ట్ త్రిపురనేని గోపీచంద్ అన్నారు. పైడిపల్లి ఆరెపల్లి ములుగు రోడ్డు ప్రాంతంలో ఆటో డ్రైవర్లకు ఆదివారం డ్రస్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్మ మార్గంలో ఉంటే భగవంతుడు అండగా ఉంటాడని చెప్పారు. భోజన విరామం అనంతరం జరిగిన లాయక్ అహ్మద్ సంగీత కచేరీ అలరించింది. కార్యక్రమంలో ట్రస్టీలు బండారు సాయి నారాయణ, ఉమాశంకర్, రాంరెడ్డి, చక్రపాణి, వెంకటరమణ, కిశోర్ పాల్గొన్నారు.

పక్షవాతానికి అధునాతన చికిత్స


మాట్లాడుతున్న బుచ్చిరెడ్డి

హన్మకొండ: పక్షవాతానికి గురైన రోగులకు ప్రత్యేక చికిత్స అందిస్తున్నట్లు రోహిణి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ బుచ్చిరెడ్డి అన్నారు. ప్రపంచ పక్షవాత దినోత్సవం సందర్భంగా హనుమకొండ సుబేదారిలోని రోహిణి ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన బ్రెయిన్ స్ట్రోక్ యూనిట్ న్యూరో ఐసీయూను ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ బుచ్చిరెడ్డి ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పక్షవాతానికి అధునాతన పద్ధతుల ద్వారా చికిత్స అందిస్తున్నట్లు వివరించారు. ఆరోగ్యశ్రీ ద్వారా చేరిన రోగులకు ఇతర రోగులతో సమానంగా ప్రాధాన్యం ఇస్తూ వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. న్యూరో విభాగం డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ ఓం ప్రకాష్ మాట్లాడుతూ బ్రెయిన్ స్ట్రోక్ ద్వారా పక్షవాతం వస్తుందన్నారు. తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా బ్రెయిన్ స్ట్రోక్‌కు గురికాకుండా ఉండవచ్చని చెప్పారు. కార్యక్రమంలో న్యూరో కన్సల్‌టెంట్ డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ సుధాకర్ రెడ్డి, డాక్టర్ రాంరెడ్డి పాల్గొన్నారు.

బెల్ట్ షాపులపై ఎన్నికల అధికారుల దాడులు

నడికూడ: మండలంలోని రామకృష్ణాపూర్, కంఠాత్మకూర్, ధర్మారం గ్రామాల్లోని బెల్ట్ షాపులపై ఎన్నికల అధికారి (ఎంసీసీటీం) శేషాద్రిస్వామి, పరకాల ఎస్సై సత్యనారాయణ ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో అక్రమ మద్యం విక్రయించొద్దని సూచించారు. ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని వారు కోరారు. బెల్ట్‌షాపులపై ప్రత్యేక నిఘా ఉంచుతున్నట్లు తెలిపారు. మద్యం విక్రయించి కేసుల పాలు కావొద్దని హెచ్చరించారు.

నరకాసుర వధ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి


ఏసీపీ కిషన్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ రవి, తదితరులు

కరీమాబాద్: ఎన్నికల కోడ్ నిబంధనల నేపథ్యంలో నరకాసుర వధ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని వరంగల ఏసీపీ బోనాల కిషన్ సూచించారు. 40వ డివిజన్ కార్పొరేటర్, నరకాసుర వధ కమిటీ అధ్యక్షుడు మరుపల్ల రవి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ఆదివారం ఏసీపీ కిషన్‌ను కలిశారు. వేడుకల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మరుపల్లి గౌతం, దూడ కొమురెల్లి, మరుపల్లి శివ, తొటం నర్సింహ, కొమ్ము రాజు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల పూజలు



హన్మకొండ: వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో గెలుపొంది, మంత్రిగా బాధ్యతలు చేపట్టాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. ఈమేరకు యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ ఆలయంలో మాజీ కార్పొరేటర్ తాడిశెట్టి విద్యాసాగర్ ఆధ్వర్యంలో ఆదివారం పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గుంటి శ్రీనివాస్, నలుబోలు సతీష్, వీరగంటి రవీందర్ పాల్గొన్నారు.

శిలాఫలకం ధ్వంసం



ఐనవోలు: మండలంలోని నర్సింహులగూడెం గ్రామంలో ఇటీవల పంచాయతీరాజ్ నిధులు రూ.2.39 కోట్లతో బీటీ రోడ్డు వేశారు. ఈ నెల 5వ తేదీన ఎమ్మెల్యే అరూరి రమేష్ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అయితే, గుర్తు తెలియని వ్యక్తులు ఆ శిలాఫలకాన్ని శనివారం రాత్రి ధ్వంసం చేశారు. దాంతో నర్సింహులగూడెం కారోబార్ కుంటాల బాబు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వంగాల నవీన్‌కుమార్ తెలిపారు.

'చలివాగు కాల్వ'కు గండి



శాయంపేట : మండలంలోని జోగంపల్లి శివారు మధ్యతరహా చలివాగు ప్రాజెక్టు ప్రధాన కాల్వకు శనివారం రాత్రి గండి పడింది. గండి ద్వారా నీరు చలివాగులోకి ప్రవహించింది. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులకు సమాచారం ఇవ్వగా, చలివాగు తూము షట్టర్ మూసి వేయించి నీటిని నిలుపుదల చేయించారు. ప్రాజెక్టు ద్వారా అధికారికంగా 3,067 ఎకరాలకు సాగునీరు అందుతుండగా, మరో రెండు వేల ఎకరాలకు అనధికారికంగా సాగు నీరు అందుతోంది. ప్రధాన కాల్వ ద్వారా శాయంపేట, పరకాల, రేగొండ, మండలాలకు సాగునీరు అందుతోంది. కొత్తగా నిర్మించిన బ్రిడ్జి పక్కనే ప్రధాన కాల్వకు గతేడాది గండిపడగా, అధికారులు తాత్కాలిక మరమ్మతు పనులు చేపట్టారు. కాల్వ కుంగిపోవడంతో నీటిని తక్కువ పరిమాణంలో సరఫరా చేస్తున్నారు. దీంతో చివరి ఆయకట్టుకు సాగునీరు అందకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పంటలు ఎండిపోకుండా సాగునీరు అందించాలని కర్షకులు కోరారు. కాల్వకు సంపూర్ణిగా నీరు విడుదల చేయడంతో గత నెల నుంచి నీరు పారుతోంది. అయితే, శనివారం రాత్రి ప్రధాన కాల్వకు గండి పడడంతో నీరంతా చలివాగులోకి వెళ్లాయి. స్థానిక సర్పంచ్, అధికారులు చలివాగు తూము షట్టర్ మూసి నీటి సరఫరాను నిలిపివేశారు.

నీరా.. తనివితీరా..!



కాజీపేట: ఈత చెట్ల నుంచి ఉదయం పూట తీసే నీరాకు ప్రజల నుంచి విశేష ఆదరణ ఉంది. ఈ నీరాలో అనేక ఔషధ గుణాలున్నాయని, అది తాగితే రోగ నిరోధక శక్తి పెరుగుతుందనే భావన ఉంది. షుగర్ పేషంట్లకు దివ్య ఔషధంగా పని చేస్తుందనే నమ్మకంతో చాలా మంది నీరా తాగేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. కాజీపేట మండల కేంద్రం శివారులో ఉన్న అనేక గ్రామాల్లో ఈత చెట్ల నుంచి గీత కార్మికులు ఉదయం, సాయంత్రం నీరా సేకరించి విక్రయిస్తున్నారు. ఉదయం పూట తీస్తున్న నీరా కొనుగోలుకు అనేక మంది ముందుకు వస్తుండడంతో నీరాకు మార్కెట్‌లో బాగా డిమాండ్ పెరిగింది. ముందస్తుగా ఫోన్లలో నీరాను ఆర్డర్ చేసి మరీ కొనుగోలు చేస్తున్నారు.

సర్వమత సమ్మేళనంగా 'పశ్చిమ'


వినయ్‌భాస్కర్‌ను ఆశీర్వదిస్తున్న మార్కండేయ

కాజీపేట: ప్రజల సహకారంతో వరంగల్ పశ్చిమ నియోజక వర్గాన్ని సర్వమత సమ్మేళనంగా మార్చినట్లు బీఆర్ఎస్ అభ్యర్థి, చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. కాజీపేట 63వ డివిజన్ అంబేడ్కర్‌నగర్ కాలనీలోని ఆల్ఫా ఒమేగా చర్చిలో ఆదివారం కోతకాల కృతజ్ఞత అర్పణాల పండుగను ప్రారంభించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పశ్చిమ ఎమ్మెల్యేగా వినయ్‌భాస్కర్ విజయం సాధించాలని బిషప్ జాన్ మార్కండేయ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సంకు నర్సింగ్, పార్టీ ఇన్‌చార్జ్ మిట్టపల్లి రవీందర్, డివిజన్ అధ్యక్షుడు రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

వినయ్‌భాస్కర్ గెలుపునకు కృషి

కాజీపేట అర్బన్: పశ్చిమ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి వినయ్‌భాస్కర్ గెలుపునకు ప్రతీఒక్కరు కృషి చేయాలని కుడా చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్ కోరారు. హంటర్‌రోడ్డులోని అభిరామ్ గార్డెన్స్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన 31వ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమన్వయంతో కార్యకర్తలు ఇంటింటికి బీఆర్ఎస్ సంక్షేమ పథకాలు, వినయ్‌భాస్కర్ చేసిన సేవలను తీసుకెళ్లి గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మామిండ్ల రాజు, నాయకులు పాల్గొన్నారు.

వారంటీ లేని గ్యారంటీలు మనకొద్దు


వరంగల్: కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రమేష్

వరంగల్: వారంటీ లేని ఆరు గ్యారంటీలు మనకు వద్దని, సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే ముద్దు అని బీఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. 14వ డివిజన్ సాయి గణేష్ కాలనీకి చెందిన పలువురు మహిళలు, ఎస్సార్‌నగర్‌కు చెందిన కాంగ్రెస్ యూత్ కార్యకర్తలు ఆదివారం బీఆర్ఎస్‌లో చేశారు. కార్యక్రమంలో జిల్లా రైతు బంధు జిల్లా అధ్యక్షురాలు లలితాయాదవ్, స్థానిక కార్పొరేటర్ తూర్పాటి సులోచన, డివిజన్ అధ్యక్షుడు ముడుసు నరసింహ, నాయకులు కేతిరి రాజశేఖర్, గంద్రాతి భాస్కర్, దుబ్బ శీను, రామ్మూర్తి, మాధవి, మోటే చిరంజీవి, న్యాతని గోపాల్, విజయ, మల్లయ్య, జంగం రాజు, ఈర్ల రాజేందర్, శంకర్, అఫ్జల్, బబ్బు, స్టాలిన్, సమ్మక్క పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

హసన్‌పర్తి: ఇటీవల మరణించిన హసన్‌పర్తి మండలం దేవన్నపేటకు చెందిన వెన్నపురెడ్డి రాజిరెడ్డి, సందెల లచ్చమ్మ, సందెల చందర్ కుటుంబ సభ్యులతో పాటు అనారోగ్యంతో బాధపడుతున్న పోలెపల్లి రాజు, సూరం మనోహర్, జనగాని నవీన్, సిలువేరు రమేష్‌ను వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ ఆదివారం పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జక్కుల వెంకటేశ్వర్లు, ఆత్మ డైరెక్టర్ భూపాల్, మాజీ సర్పంచ్ రవి, పీఏసీఎస్ డైరెక్టర్లు విజేందర్, బీఆర్ఎస్ నాయకులు వాసుదేవారెడ్డి, కుందూరు అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.

కేసీఆర్ పాలనకు చరమగీతం పాడాలి


నియోజకవర్గంలో ప్రచారం చేస్తున్న బీజేపీ అభ్యర్థి రావు పద్మ, నాయకులు

హన్మకొండ: కేసీఆర్ ప్రజా వ్యతిరేక పాలనకు చరమగీతం పాడాలని బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు అన్నారు. హనుమకొండ దీన్‌దయాల్‌నగర్‌లో బీజేపీ పోలింగ్ బూత్ అధ్యక్షులు, నాయకుల సమావేశం ఆదివారం జరిగింది. అంతకు ముందు కాజీపేట దర్గా, సాయంత్రం న్యూశాయంపేటలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు, బీజేపీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి రావు పద్మ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆ రెండు కార్యక్రమాల్లో మార్తినేని ధర్మారావు పాల్గొని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత పోలింగ్ బూత్ అధ్యక్షులదేనని గుర్తుచేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షురాలు, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి రావు పద్మ మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ద్వారానే తెలంగాణ ప్రజల ఉద్యమ ఆకాంక్షలు నెరవేరుతాయని చెప్పారు. కేసీఆర్ కుటుంబ పాలనలో ఏఒక్క వర్గమూ సంతోషంగా లేదని విమర్శించారు. ఇక్కడి అధికార పార్టీ అభ్యర్థి కబ్జాలకు కేరాఫ్ అడ్రస్ అయితే.. కాంగ్రెస్.. కుంభకోణాలకు చిరునామా అని దుయ్యబట్టారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చాడ శ్రీనివాస్ రెడ్డి, రావుల కిషన్, కొలను సంతోష్, దేశిని సదానందం, కందగట్ల సత్యనారాయణ, బైరి లక్ష్మి, రావుల కోమల, చాడ స్వాతి, గుజ్జుల వసంత మహేందర్ రెడ్డి, జిల్లా పదాధికారులు, వివిధ మోర్చాల అధ్యక్షులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, డివిజన్ అధ్యక్షులు, డివిజన్ ఇన్‌చార్జ్‌లు, శక్తి కేంద్ర ఇన్‌చార్జ్‌లు, బూత్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్, బీజేపీ ఓటమే సీపీఐ లక్ష్యం


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ఖిలా వరంగల్: బీఆర్ఎస్, బీజేపీ ఓటమే సీపీఐ లక్ష్యమని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తక్కెళ్లపల్లి శ్రీనివాస్‌రావు అన్నారు. వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో పరికిరాల రమేష్ అధ్యక్షతన పార్టీ జిల్లా సమితి సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమాన్ని విస్మరించి నియంతృత్వ పాలన సాగిస్తున్నాయని ఆరోపించారు. ఈ రెండు పార్టీలు ఎన్ని జిమ్మిక్కులు చేసినా ప్రజలు నమ్మరని ఆయన అన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్, షేక్ బాషుమియా, పనాస ప్రసాద్, రవీందర్, గన్నారపు రమేష్, బుస్సా రవీందర్, తోట చంద్రకళ, గుండె బద్రి, చెన్న కేశవులు, దామెర కృష్ణ, రహేలా, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

'విశ్వబ్రాహ్మణ సభ' కరపత్రాల ఆవిష్కరణ


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు

హన్మకొండ: నవంబర్ 5వ తేదీన హైదరాబాద్ ఉప్పల్‌లోని బగాయిత్‌లో జరగనున్న విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మహాజన సభకు పెద్దసంఖ్యలో తరలివచ్చి విశ్వబ్రాహ్మణుల ఐక్యతను చాటాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచార్యులు పిలుపునిచ్చారు. ఈమేరకు హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో మహాజన సభ కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణమాచార్యులు మాట్లాడుతూ మహాజన సభ ద్వారా పాలక, ప్రతిపక్ష పార్టీల దృష్టికి సమస్యలు తీసుకెళ్లడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు అలుగోజు కృష్ణమూర్తి, వోపా జిల్లా అధ్యక్షుడు రామోజు నాగరాజు, నాయకులు పెండోట చక్రపాణి, వీణవంక సదానందం, గజ్జెల వీరన్న, రాళ్లబండి వీరాచారి, జయసేన, నాగసోమేశ్వరాచారి, విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'సమర శంఖారావం'

కమలాపూర్ : మండలం కేంద్రంలోని ఉమామహేశ్వర గార్డెన్స్‌లో సోమవారం 'హుజూరాబాద్ సమర శంఖారావం' నిర్వహించనున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు కట్కూరి అశోక్‌రెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హుజూరాబాద్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి, రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ హాజరుకానున్నట్లు తెలిపారు. ఉదయం 9.30 గంటలకు మండలంలోని బత్తివన్‌పల్లి హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వరంగల్ అర్బన్:
9951602875 9553955722
9010299096
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎల్. రాజేష్ వర్మ (SR) : 9885438059 (హన్మకొండ)
కె. సుధాకర్ (ACO) : 9177258410 (హన్మకొండ)
పి. చంద్రశేఖర్ (ACO) : 8074606274 (వరంగల్)
జి. రవియాదవ్ (ACO) : 9032782191 (కాజీపేట)